క్లుప్తంగా

అర్బన్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


కులశేఖర్

చిత్తూరు రూరల్ (కాణి పాకం): చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా కులశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తర్వాత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. పెండింగ్ వివరాలను ఆరా తీశారు.

తహసీల్దార్‌గా లోకేశ్వరి


బాధ్యతలు స్వీకరిస్తున్న లోకేశ్వరి

ఐరాల: తహసీల్దార్‌గా లోకేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు రూరల్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ మహేష్‌కుమార్ డీటీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో మహేష్‌కుమార్ పెనుమూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేసేవారు. అక్కడి నుంచి పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడికి వచ్చారు. లోకేశ్వరి మాట్లాడుతూ, మండలంలోని భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

22న తిరుపతిలో బీసీల ఆత్మగౌరవ సభ


మాట్లాడుతున్న పరసారత్నం, బీసీ నాయకులు.

బంగారుపాళెం: ఈ నెల 22న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన బీసీల ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి పరసారత్నం పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం తగ్గువారిపల్లెలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ఆత్మ గౌరవ సభకు రాష్ట్రంలోని బీసీ మంత్రులు హాజరు కానున్నారని చెప్పారు. బీసీసీ, ఎస్సీలు తరలి వచ్చి దీనిని విజయవంతం చేశాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ నేత ఆల్మన్‌రాజ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, జానపద వృత్తి కళాకారుల జాతీయ అధ్యక్షుడు యాదగిరి, ఏపీఎఫ్ కన్వీనర్ రఘునాథ్ సింగ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బుస్సా నాగరాజగౌడ్, నాయకులు నీరజాక్షులు గౌడ్, మురళి, చిన్నయ్య పాల్గొన్నారు.

పన్నులపై మోజు.. డ్రైనేజీలు గలీజు


వీఎస్.అగ్రహారంలో మురుగు కాలువ దుస్థితి

ఐరాల: ఇంటి పన్ను, కొళాయి పన్ను, క్రీడా పన్ను, గ్రంథాలయం పన్నులు..ఇలా పలురకాల పన్నులతో ప్రజల ముక్కుపిండి పంచాయతీ అధికారులు వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలపై మాత్రం దృష్టి సారించడం లేదు. వీఎస్.అగ్రహారంలో ఇళ్ల ముందర కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు నిల్వ మూలాన దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. మురుగు కాలువ చుట్టూ చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాములు సంచరిస్తున్నాయి. ప్లాస్టిక్, కూల్ డ్రింక్ బాటిళ్లు, తదితర ప్లాస్టిక్ సామగ్రి మురుగు కాలువలో ఉండడంతో దుర్వాసన చిమ్ముతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు మురుగు కాలువ శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

పానాటూరులో 'ఫ్యామిలీ డాక్టర్'


పానాటూరులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రశ్మిత

గుడిపాల: మండలంలోని పానాటూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రశ్మిత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, మధుమేహం రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, వీరలక్ష్మి, శివగామి, మణిమేఘల, భారతి పాల్గొన్నారు.

నలగాంపల్లె హైవేపై బైఠాయించి ధర్నా చేస్తున్న మామిడి రైతులు



గంగాసాగరం వద్ద రోడ్డుపై రైతులు



చిత్తూరు నగరం గంగాసాగరం ఫ్యాక్టరీ వద్ద క్యూ కట్టిన రైతులు



కదం తొక్కిన మామిడి రైతులు

- నలగాంపల్లె, గంగాసాగరం వద్ద ధర్నా
- టోకెన్లు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- చెన్నై–బెంగళూరు హైవేపై ఆందోళన
- 19వ తేదీ వరకు టోకెన్ల జారీ నిలిపేస్తున్నట్లు ప్రకటించిన జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం
- తహసీల్దార్, సీఐ, రైతులు చర్చించినా ఫలితం శూన్యం


రైతు సోదరులకు విజ్ఞప్తి/ గమనిక

ఫ్యాక్టరీ వద్ద టోకెన్ల జారీ నిలిపేస్తున్నట్లు కరపత్రాన్ని అతికించిన యాజమాన్యం


బంగారుపాళెం: టోకెన్ల కోసం వచ్చి పడిగాపులు కాస్తున్న మామిడికాయల ట్రాక్టర్లు

బంగారుపాళెం:మండలంలోని నలగాంపల్లెలో సోమవారం మామిడి రైతులు టోకెన్ల కోసం ధర్నా చేశారు. సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీకి తోతాపురి మామిడి కాయలు తరలించడానికి యాజమాన్యం టోకెన్లు ఇవ్వకపోవడంతో ఆగ్రహించారు. టోకెన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫ్యాక్టరీ సమీపంలోని చెన్నై–బెంగళూరు హైవేపై బైఠాయించి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నలగాంపల్లె వద్దకు చేరుకున్నారు. సీఐ శ్రీనివాసులు ఆందోళనకారులతో మాట్లాడారు. జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి టోకెన్లు జారీ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారిని అక్కడ నుంచి ఫ్యాక్టరీ వద్దకు తీసుకువెళ్లారు. అయితే అప్పటికే జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద ఉదయం నుంచి పర్మిట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు తోతాపురి మామిడి కాయలు(బెంగళూర)కొనుగోలు టోకెన్లు ఇవ్వలేమని జ్యూస్‌ఫ్యాక్టరీ యాజమాన్యం స్పష్టం చేయడంతో రైతులు మండిపడ్డారు. పలువురు రైతులు మాట్లాడుతూ, వారం రోజులుగా టోకెన్ల కోసం ఫ్యాక్టరీ వద్ద పడిగాపులు కాస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదని విమర్శించారు. రెకమెండేషన్లు ఉన్నవారికి మాత్రం టోకెన్లు జారీచేసి కాయలను ఫ్యాక్టరీలోకి అనుమతిస్తున్నారని ఆరోపించారు. 50 ట్రాక్టర్లలో కాయలు తీసుకు వచ్చిన రైతులు మూడు రోజులుగా ఫ్యాక్టరీ వద్ద ఉన్నా కొనుగోలుకు అనుమతించలేదని, సన్నచిన్న కారు రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మధ్యాహ్నం వరకు సుమారు 200 మంది రైతులు, మహిళలు టోకెన్ల కోసం పడిగాపులు కాశారు. మండుటెండలో నిలుచుకుని ఉన్న తమకు ఫ్యాకరీ యాజమాన్యం కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పండిన కాయలను అమ్ముకోవడానికి నానాతంటాలు పడాల్సి వస్తోందన్నారు. ఎక్కువగా పండే బెంగళూర మామిడి అమ్ముడుపోక అవస్థలు పడుతున్నామని, టోకెన్ల పేరిట ఫ్యాక్టరీ యాజమాన్యం చుక్కలు చూపిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం 8 రూపాయలకు కొనుగోలు చేయాలని నిర్ణయించినా అవేవీ పట్టించుకోవడం లేదని రైతులు తమ ఆక్రోశం వెళ్లగక్కారు.


గంగాసాగరం ఫ్యాక్టరీ ఎదుట క్యూలో పెట్టిన ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం నకలు పత్రాలు, రాళ్లు


గంగాసాగరం వద్ద రైతుల ధాటికి నేలమట్టమవుతున్న ఇనుప గేటు

రోజుకు 10 టోకెన్లు జారీ చేస్తామన్న యాజమాన్యం

మామిడి రైతులు ఆందోళనతో తహసీల్దార్ బాబూరాజేంద్ర ప్రసాద్, సీఐ, రైతులు, జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో టోకెన్ల జారీ విషయమై చర్చించారు. 20 నుంచి 30వ తేదీ వరకు రోజుకు 10 టోకెన్లు జారీ చేస్తామని తెలిపినట్లు తహసీల్దార్ చెప్పారు. దీంతో మిగిలిన రైతులు మామిడి కాయలను ఎలా అమ్ముకోవాలంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చేసేదేమీ లేక నిరాశగా వెనుదిరిగారు. మండలంలో మొగిలి శ్రీని ఫుడ్స్, నలగాంపల్లెలో సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీలలో సన్‌గోల్డ్ మాత్రమే క్రషింగ్‌కు పూనుకుంది. శ్రీని ఫుడ్స్ క్రషింగ్ ప్రారంభించలేదు. ఈ సంవత్సరం పంటకు పెట్టిన ఖర్చులు సైతం వచ్చే పరిస్థితి లేదని, పరిస్థితి ఇలానే కొనసాగితే తోటల్లోనే కాయలు మగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు తోతాపురి కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదలా ఉంచితే చిత్తూరు నగరం గంగాసాగరం ఫ్యాక్టరీ వద్ద సైతం రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం

- జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పుస్తకావిష్కరణ
- మామిడి రైతులపై సర్కార్ అలక్ష్యం
- నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి విమర్శ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: 'అలవిగానీ హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తుంటే చూస్తూ ఉరుకోం. ప్రజల పక్షాన నిలబడతాం ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు ఒత్తిడి తీసుకువస్తాం' అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజక వర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులతో కలిసి 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' అనే వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జగనన్న పాలనలో రూ.2.81 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించారన్నారు. ఏడాది బాబు పాలనలో సూపర్‌సిక్స్ ద్వారా రూ.81వేల కోట్లు ప్రజలకు ఇవ్వాల్సి ఉందని, ఆ బాకీ తీర్చే వరకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పోరాటాలు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేయడంతోనే 'తల్లికి వందనం ' నిధులు విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వంలో 'అమ్మఒడి' నిధుల నుంచి రూ.2వేల చొప్పున పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తే జే ట్యాక్స్ అంటూ దుష్ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ కో ఇవాళ అదే పద్ధతిలో రూ.13వేలు మాత్రమే ఇస్తోందని దుయ్యబట్టారు. అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయకుండా జాప్యం చేయడం దారుణమన్నారు.

మామిడి రైతులు అల్లాడుతున్నారు

గత పాలనలో మామిడి కిలో రూ.18–24తో కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం కిలోకు రూ.6 ఇస్తే మామిడి అమ్ముకుంటామని రైతులు ఎదురుచూస్తున్న దుస్థితి నెలకొందని చెప్పారు. టోకెన్ల కోసం జిల్లాలో ఫ్యాక్టరీల వద్ద క్యూ కడుతూ తిండీతిప్పలు లేక అల్లాడుతున్నారన్నారు. కర్షకులు ఇంత బాధపడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని చెప్పారు. ప్రభుత్వ హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఉపాధి లేక వేలాది మంది పక్క రాష్ట్రాలకు వలస వెళుతున్నారని గుర్తుచేశారు. ఇంతవరకూ ఒక పరిశ్రమ రాలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తారని యువత వేచి చూస్తోందన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళమేరీ, చిత్తూరు నియోజకవర్గ మహిళ విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి, నాయకులు లక్ష్మణ స్వామి, నారాయణ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వందనం కాదు..తల్లికి పంగనామం

– జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి విమర్శ



యాదమరి: తల్లికి వందనం పేరిట తల్లులకు కూటమి ప్రభుత్వం పంగనామం పెట్టిందని జెడ్పీ వైస్ చైర్మన్, యాదమరి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ధనుంజయ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున వారి తల్లుల ఖాతాలో జమ చేస్తామన్న చంద్రబాబు రూ.2వేలు కోత పెట్టారని విమర్శించారు. అంతేకాకుండా సర్పంచులు, ఎంపీటీసీలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు తల్లికి వందనం వర్తించకుండా నిబంధనల పేరిట కొర్రీలు పెట్టడం దారుణమన్నారు. పైగా తూతూ మంత్రంగా కొందరికి మాత్రమే నిధులు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని, అర్హులైన పేద ప్రజలకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సత్వరమే నిధులు విడుదల కాని మిగిలిన తల్లుల ఖాతాలకు డబ్బులు జమచేయాలని డిమాండ్ చేశారు

వినతుల స్వీకరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో ఆయా శాఖల అధికారులు పరిష్కరించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంజినీరింగ్: 3, రెవెన్యూ: 2, ప్రధాన కార్యాలయం: 2, పింఛను: 1 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన


పలమనేరులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు తమకూ వర్తింపచేయాలని కోరుతూ పలమనేరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. తమను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం, పింఛన్లు లాంటివి తమకు రాకుండా కొర్రీలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు అండగా ఉంటామని ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా దగా చేస్తున్నారని విమర్శించారు. తమకు న్యాయం చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. నాయకురాళ్లు లక్ష్మీదేవి, లక్ష్మి, సుమ, అనుపమ, సరస్వతి, ఫరీదా, ఉమ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు చీకటి రోజులు

- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్
- కూటమి మోసాలపై ముద్రించిన పుస్తకం ఆవిష్కరణ


కూటమి ప్రభుత్వం మోసాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం:కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ప్రజలకు చీకటి రోజులను మిగిల్చిందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం'అనే పుస్తకాన్ని సోమవారం సాయంత్రం బంగారుపాళెంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా నివాసం వద్ద నాయకులతో కలిసి సునీల్ ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్‌ను నిర్మించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన దానిని విధ్వంసం చేస్తోందని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే నమ్మకం...చంద్రబాబు అంటే మోసమని అన్నారు. కూటమి పాలనను ప్రజలు జగన్ ఏడాది పాలనతో సరిపోల్చి చూస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారన్నారు. బాబు ఎన్నికలకు జగన్ ఇచ్చిన పథకాలకంటే ఎక్కువే ఇస్తానని చెప్పి తాను ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను సైతం సక్రమంగా ప్రజలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేష్ రెడ్‌బుక్ పేరిట అరాచకాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కూట మి ప్రభుత్వం ఏడాది పాలనకు ఈ పుస్తకం అద్దం పడుతుందన్నారు. వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రజలకు అందుబాటులో పుస్తకాన్ని అందుబాటు లో పెడుతామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సీనియర్ నాయకులు థామస్, ఉపసర్పంచ్ కామరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, నాయకులు రఘుపతిరాజు, చిన్నా, సుధాకర్ పాల్గొన్నారు.

అతిసారంపై అవగాహన ర్యాలీ

చౌడేపల్లె: కలుషితమైన ఆహారం తినొద్దు... అతిసారం బారిన పడొద్దు అని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అతిసారం పై జూలై 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈగలు వాలిన ఆహారం, కలుషితాహారం, సద్ది అన్నం తినడం వలన విరోచనాలు, వాంతులయ్యే అవకాశం ఉందని, ఇలాంటి లక్షణాలుంటే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బహుద్దీన్, జమున ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తీర్థంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది